క్రీడా పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి

కొత్తపల్లి, అక్టోబర్ 23 : కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయిలో అద్భుతంగా రాణించి, అర్జున అవార్డులు సాధించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం మానేరు సమీపంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్ సందర్శించారు. పాఠశాలలో నూతనంగా ఆధునీకరించిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఒలింపిక్స్, పారాఒలింపిక్స్ విజేతల ఫొటో ప్రదర్శనను తిలకించారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అలాగే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరికీ ట్రాక్ సూట్, ట్రాలీ సూట్‌కేస్ అందిస్తామని ప్రోత్సహించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే జిల్లా కోఆర్డినేటర్ వెంకట్ రాంబాబు, హెచ్ఎం, అధ్యాపకులు, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవేందర్‌రెడ్డి ఇంటికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, నాయకులతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబర్23: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిరెడ్డి వనిత ఇంటికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం ఉదయం వచ్చారు. దేవేందర్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వచ్చి కొద్దిసేపు గడిపారు. కౌశిక్‌రెడ్డి వచ్చిన విషయం తెలుసుకొని పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు ఎమ్మెల్యేతో ఫొటోలు తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా.. మండలంలో మాత్రం దేవేందర్‌రెడ్డి లాంటి నాయకుల వల్లే పార్టీ బలంగా ఉందని ఎమ్మెల్యే అభినందించారు. మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూట్రిషియన్ డే

కలెక్టరేట్, అక్టోబర్ 23 : నగరంలోని పలు సెక్టార్‌లలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం న్యూట్రిషియన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల పరిధిలోని యూపీహెచ్‌సీ వైద్యులు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి, పోషణ లోపం ఉన్న వారిని గుర్తించారు. వారందరినీ డీఐఈఓసీకి సిఫారసు చేస్తూ, మందులు పంపిణీ చేశారు. అంతకుముందు లక్ష్మీనగర్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో సబిత మాట్లాడుతూ, ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలకు పీహెచ్‌సీలు, ప్రధాన దవాఖానలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హౌసింగ్‌బోర్డు, కోతిరాంపూర్, సుభాష్‌నగర్, కార్ఖానాగడ్డ, తదితర చోట్ల గల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా సెంటర్ల పరిధిలోని పీహెచ్‌సీల వైద్యులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ, టీచర్ ఎం పద్మ తదితరులతోపాటు ఆయాలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

బనారస్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రాంపూర్ వాసి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 23: హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన డా. గోసికొండ శ్రీరాములు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోని సామాజిక శాస్త్ర విభాగంలో (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ)అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. చేనేత కుటుంబానికి చెందిన కనకలక్ష్మి – జనార్దన్ దంపతుల కుమారుడు శ్రీరాములు. తల్లిదండ్రులు అతడిని ఉపాధ్యాయుడిగా చూడాలని కలలు కనేవారు. ఈ క్రమంలో 2016 లో తండ్రిని, ఐదు నెలల క్రితం తల్లిని శ్రీరాములు కోల్పోయారు. అయినా.. మొక్కవోని దీక్షతో శ్రమించి ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసి, దేశంలోనే అతి పురాతనమైన, గొప్ప చరిత్ర కలిగిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం సాధించారు. శ్రీరాములు విజయంపై ఉపాధ్యాయులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాయకుల ఎంపిక

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 23 : ప్రజాకవి, సినీ గేయ రచయిత, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయకావ్యం 'ఓయమ్మ నా పల్లె సీమ' పాట ఆలపించేందుకు గాయనీ గాయకుల ఎంపిక కార్యక్రమం ఫిల్మ్ భవన్ కరీంనగర్‌లో అట్టహాసంగా జరిగింది. 243 చరణాలు గల ఈ గేయాన్ని 243 మంది గాయనీ గాయకులతో పాడించే సంకల్పంతో ఈ ఎంపిక చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తేలు విజయ, వొల్లాల వాణి, దేవయ్య, మల్లిక్ తేజ, బుర్ర సతీశ్, ఓరుగంటి శేఖర్, పొద్దుపోడుపు శంకర్, జూపాక శివ, గోల్కొండ బుచ్చన్న, గడ్డం రమేశ్, రామంచ భరత్, నక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య లక్ష్మీనర్సమ్మకు వీడ్కోలు

ఎమ్మెల్యే గంగులను పరామర్శిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

అంతిమ యాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, తదితరులు

కార్పొరేషన్/రామడుగు, అక్టోబర్ 23 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు బుధవారం కరీంనగర్‌లో అశ్రునయనాల మధ్య ముగిశాయి. క్రిస్టియన్ కాలనీలోని స్వగృహం నుంచి సప్తగిరి కాలనీలోని స్వర్గధామం వరకు జరిగిన అంతిమ యాత్రకు భారీ సంఖ్యలో రాజకీయ నాయకులు, బంధువులు తరలివచ్చారు. అంతకుముందు మాజీ మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, వాటర్ రిసోర్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి. ప్రకాశ్, రాకేశ్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, నగర మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్, సివిల్ సప్లైకార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో ఉమా మహేశ్వర్, టీఎన్‌జీవో నాయకులు, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు లక్ష్మీనర్సమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గంగుల కమలాకర్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గంగుల కమలాకర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఇక్కడ రామడుగు మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎడ్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రైతు పండించిన ప్రతి గింజనూ కొంటాం

- ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి

తిమ్మాపూర్ రూరల్,అక్టోబర్ 23 : వానకాలం సీజన్‌లో పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రామకృష్ణ కాలనీ, నుస్తులాపూర్, బాలయ్యపల్లి, మొగిలిపాలెం, పొలంపల్లి, నర్సింగపూర్, మల్లాపూర్, మన్నెంపెల్లి, పోరండ్ల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గంకిడి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటాలి

తిమ్మాపూర్, అక్టోబర్ 23: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడా వందనం స్వీకరించారు. విద్యార్థులు గురుకుల సొసైటీలు, ఇతర క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని సూచించారు. క్రీడల్లో ఉమ్మడి జిల్లాలోని 15 పాఠశాలల నుంచి 525మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడ ఆర్డీవో అంజలి, ప్రిన్సిపాల్ సరిత, ఉమ్మడి జిల్లాలోని ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా రజిత

వీణవంక, అక్టోబర్ 23: వీణవంక నూతన ట్రాన్స్‌కో ఏఈగా రజిత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తోటి అధికారులు, సిబ్బంది ఆమెను సన్మానించి, ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పోతిరెడ్డిపల్లి లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందం, లైన్‌మెన్‌లు రహీం, పాషా, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్లను ప్రారంభించిన కార్పొరేటర్

కార్పొరేషన్/ కరీంనగర్ రూరల్, అక్టోబర్ 23 : నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలో రూ. 80 వేలతో కొత్తగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను కార్పొరేటర్ కాశెట్టి లావణ్యా శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కాశెట్టి శ్రీనివాస్, మూల కృష్ణారెడ్డి, పడాల స్వామి గౌడ్, హ్యాపీ హోమ్స్ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, కార్యదర్శి రవి, కాంట్రాక్టర్ భిక్షపతి, ఎలక్ట్రిషియన్స్ రాజు, శివ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు నాణ్యమైన పత్తిని తీసుకురావాలి

- వరంగల్ జేడీ శ్రీనివాస్
- జమ్మికుంటలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

జమ్మికుంట, అక్టోబర్23: ప్రభుత్వ మద్దతు ధరతో కాటన్ కొనుగోళ్లకు సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సిద్ధంగా ఉందని, మార్కెట్‌కు నాణ్యమైన పత్తిని తెచ్చి 'మద్దతు' క్వింటాల్‌కు రూ. 7521 పొందాలని వరంగల్ జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంవో ప్రకాశ్(ఉమ్మడి జిల్లా), హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు రైతులకు పిలుపునిచ్చారు. సీసీఐ ఆదేశాల మేరకు సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, కొనుగోలు కేంద్రాన్ని ఉన్నతాధికారులు ప్రారంభించారు. మాయిశ్చర్ మిషన్‌తో కాటన్‌ను పరిశీలించారు. తేమ శాతం ఎక్కువ ఉందనే కారణంతో ఒకే ఒక్క రైతుకు చెందిన పత్తిని సీసీఐ సేకరించింది. అనంతరం అధికారులు మార్కెట్‌ను కలియతిరిగారు. కొనుగోళ్లను పరిశీలించారు. తర్వాత మార్కెట్ కార్యాలయంలో మాట్లాడుతూ.. జిల్లాలోని మార్కెట్‌ల పరిధిలో 12 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశామని, అందులో జమ్మికుంటలో ఏడు, కరీంనగర్‌లో మూడు, గోపాల్‌రావుపేట, చొప్పదండిలలో ఒక్కొక్కటి చొప్పున జిన్నింగ్ మిల్లులతో అగ్రిమెంట్ చేసుకున్నామని చెప్పారు. రైతులను ఇబ్బందులు పెట్టే ప్రైవేట్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని, తూకాల్లో మోసాలపై కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాలో 10 మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మార్కెట్లలో సెంటర్లను ప్రారంభించామని చెప్పారు. ఇక్కడ మార్కెట్ అధికారులు రాజా, బాబా, సురేందర్, మార్కెట్, సీసీఐ సిబ్బంది, ప్రైవేట్ వ్యాపారులు, అడ్డిదారులు, కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

చొప్పదండి, అక్టోబర్ 23: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేయగా, పట్టణానికి చెందిన గీత విద్యాలయం ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బంది విధులు, కేసుల నమోదు, ఆయుధాల గురించి ఎస్ఐ అనూష విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగరావు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన రమేశ్‌రెడ్డి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబర్ 23: మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి మాదాడి రమేశ్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన జన్మదినం సందర్భంగా మొక్క అందజేసి ఆశీర్వాదం పొందారు.

గవర్నర్‌ను కలిసిన వీసీ ఉమేశ్ కుమార్

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ఉమేశ్ కుమార్

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 23 : శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్ కుమార్ బుధవారం యూనివర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉమేశ్‌కుమార్ వీసీగా బాధ్యతలు తీసుకున్న క్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి గవర్నర్‌ను కలిశారు.

ఇండియన్ నేవీకి తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ సతీశ్‌రావు

కొత్తపల్లి, అక్టోబర్ 23 : తేజస్ డిఫెన్స్ అకాడమీకి చెందిన 10 మంది విద్యార్థులు ఇండియన్ నేవీలో సీనియర్ సెకండరీ రిక్రూట్స్ (ఎస్ఎస్ఆర్)గా అగ్నిపథ్ స్కీం ద్వారా ఉద్యోగాలు సాధించినట్లు చైర్మన్ సీహెచ్ సతీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లిలోని తేజస్ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, జాతీయస్థాయిలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మెరిట్ ఆధారంగా ఎంపికయిన 10 మంది తమ విద్యార్థులే కావడం గర్వకారణంగా ఉందన్నారు. వీరందరూ నవంబర్ 7న ఐఎన్ఎస్ చిలుక ట్రైనింగ్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిలో కొత్తూరి యశ్వంత్, సిద్దం అనుదీప్, కూకట్ల విజయ్, దంతోజు సిద్ధూచారి, వద్దీ విష్ణువర్ధన్, తాపళ్ల గణేశ్, పూదరి విజయ్‌కృష్ణ, ఓరికె రాజ్‌కుమార్, పొగాకు మధుసూదన్‌రెడ్డి, గజ్జి మురాజ్ దేశాయ్ ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మెరుపు ధర్నా

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 23 : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రేవల్లి తిరుపతి, నాయకులు బన్సీలాల్, గిరి సురేశ్, బలరాం, రంగయ్య, భూక్యా రాజన్న, గుర్మిల్ సింగ్, శ్రీనివాస్, చరణ్ సింగ్, శంకర్, మోహన్, హన్మంతు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 23: డిమాండ్స్ డే సందర్భంగా పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు ఎదుట తపాలా ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యూ మహేందర్ మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, వెంటనే ఎనిమిదో వేతన కమిటీని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కిట్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 23: సింగాపూర్ కిట్స్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు మానవజాతికి మేలు చేస్తుందని, ఇంజినీరింగ్ విద్యార్థులు ఏఐ సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి ప్రదర్శనలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాజేశ్వరరావు, డాక్టర్ కే. ప్రవీణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్‌లో ఉద్యోగావకాశాలు

తిమ్మాపూర్, అక్టోబర్ 23: మండలంలోని ఎల్ఎండీలో గల ప్రభుత్వ జిల్లా వృత్తి శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విజ్ఞాన శాస్త్రం, కళా విద్య, వ్యాయామ విద్యతో పాటు ఉర్దూలో సైకాలజీ, విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించుటకు సంబంధిత సబ్జెక్టులో బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల26లోగా కళాశాలలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

లిఫ్ట్ ఫెయిల్ అయి ఒకరి మృతి

రాంనగర్, అక్టోబర్ 23: నగరంలోని రాజీవ్ చౌక్ ఏరియాలో శ్రీధర్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం రాత్రి లిఫ్ట్ ఫెయిల్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లో కిరాయికి ఉంటూ కరీంనగర్ సెన్సేషన్ రెస్టారెంట్‌లో పని చేస్తున్నారు. పని ముగించుకొని అర్ధరాత్రి ఇంటికి వచ్చి లిఫ్ట్‌లో ఎక్కి 4వ ఫ్లోర్‌కు వెళ్తుండగా, లిఫ్ట్ ఫెయిల్ అవడంతో ఓ వ్యక్తి వెంటనే అందులో నుంచి కిందికి దుంకగా, మరో వ్యక్తి పామాలి మాతాని లిఫ్ట్‌లో నుంచి బయటకు వచ్చే ప్రయత్నంలో తల లిఫ్ట్‌లో ఇరుక్కొని చనిపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ తెలిపారు.

'మాదిగల ప్రయోజనాలను కాలరాస్తున్న రేవంత్‌రెడ్డి'

శంకరపట్నం, అక్టోబర్ 23: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ప్రయోజనాలను కాలరాస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనిల్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ విద్యా, ఉద్యోగ అవకాశాల్లో మాదిగల ప్రయోజనాలకు అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో మాదిగల ధర్మ యుద్ధ సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు మాదిగలు, ఉప కులాలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం అంజిబాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

కొత్తపల్లి, అక్టోబర్ 23 : అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థులు ఎస్జీఎఫ్ జోనల్‌స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న హర్షిత్, మీనకేతన్, ప్రసన్నకుమార్, రవి కార్తీక్, సుశాంత్, సంజన, హిరణ్య, తనీష్‌రెడ్డి అండర్-14, 17 విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి త్వరలో నిర్వహించే బ్యాడ్మింటన్ జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు

జమ్మికుంట, అక్టోబర్ 23: మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలు విరుద్ధంగా బోర్లు వేస్తే చర్యలు తప్పవని టీపీవో శ్రీధర్ హెచ్చరించారు. పట్టణంలోని 12వ వార్డులో అక్రమంగా మున్సిపల్ రోడ్డుపై ఒకరు బోర్ వేయగా, సదరు బోర్‌ను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. నడిరోడ్డుపై బోర్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కాలనీవాసుల ఫిర్యాదుతో బోర్‌ను సీజ్ చేశామని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేస్తున్నామని చెప్పారు. ఇక్కడ ఆయన వెంట ఏఈ నరేశ్, టీపీఎస్ ప్రదీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది ఉన్నారు.

ఎల్ ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, అక్టోబర్23: ఎల్ఎండీ ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉండగా.. పైనుంచి వచ్చే వరదకు అనుగుణంగా నీటిని వదులుతున్నారు. ఎల్ఎండీలోకి మిడ్‌మానేరు నుంచి 4300 క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ ద్వారా 2వేల క్యూసెక్కుల నీళ్లు ఇన్‌ఫ్లోగా వస్తున్నాయి. రెండు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, Chiluka Bharath S/o. Chiluka Sathaiah, Mother Name Chiluka Rama (Old Name) H.No. 2-61/1, Narsingapur, Moodapalli, Chandurthi Mandal Rajanna Sircilla Dist. My Mother Name Was Changed to CHILUKA RAMADEVI (New Name)
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.